క్లుప్తంగా

ఘనంగా ఏకాదశి పూజలు



శ్రీదేవి, భూదేవి సమేత స్వామి వారిని ఊరేగిస్తున్న భక్తులు

పామిడి: స్థానిక అనంత గజగరుడ లక్ష్మీనారాయణస్వామి ఆలయంలో మంగళవారం షట్తిల ఏకాదశి పూజలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా శ్రీదేవి, భూదేవి సమేత లక్ష్మీనారాయణస్వామి దేవతామూర్తుల విగ్రహాలను శోభాయమానంగా అలంకరించి పూజలు చేశారు. భక్తులు దేవతామూర్తులను దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం దేవతామూర్తుల ఉత్సవ విగ్రహాలను పల్లకీలో ఉంచి ఊరేగించారు. ఈసందర్భంగా ఆలయ ప్రాంగణం గోవింద నామస్మరణతో మార్మోగింది.

త్రుటిలో తప్పిన ప్రమాదం



ఊడిపోయిన లారీ టైర్

గుత్తి: పట్టణంలోని కర్నూలు రోడ్డులో మంగళవారం ఓ లారీ టైర్ ఊడిపోన ఘటనలో ప్రమాదం తప్పింది. వివరాల్లోకి వెళితే.. పత్తికొండ వైపు నుంచి తాడిపత్రి వైపు వెళుతున్న లారీకి ఉన్న ఫళంగా టైర్ ఊడిపోయింది. టైర్ సుమారు 200 మీటర్లు దొర్లుకుంటూ వెళ్లింది. అయితే ఆ సమయంలో రోడ్డుపై ఎవరూ లేపోవడంతో ప్రమాదం తప్పింది.

నులి పురుగుల నివారణకు ప్రత్యేక చర్యలు



పోస్టర్లు విడుదల చేస్తున్న ఎంపీడీఓ శోభారాణి, వైద్య సిబ్బంది

బుక్కరాయసముద్రం: రాష్ట్ర ప్రభుత్వం నులి పురుగుల నివారణకు ప్రత్యేక చర్యలు చేపడుతోందని ఎంపీడీఓ శోభారాణి పేర్కొన్నారు. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఈ నెల 9న జరగబోయే నులి పురుగుల నివారణ కార్యక్రమ పోస్టర్లు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ పిల్లలకు నులి పురుగుల మందులు వేసే సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. బీకేఎస్ పట్టణ ఆరోగ్య కేంద్రం పరిధిలో 9500 టాబ్లెట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. మండల వైద్యాధికారి స్వాతి లక్ష్మి, ఎంఈఓ లింగానాయక్, సీహెచ్ఓ మోహన్‌రావు, హెల్త్ అసిస్టెంట్ ధనుంజయ పాల్గొన్నారు.

విద్యార్థులు నైపుణ్యం పెంపొందించుకోవాలి

గుంతకల్లు: విద్యార్థులు చదువుతోపాటు అనేక అంశాలపై నైపుణ్యం పెంపొందించుకోవాలని వక్తలు పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక ఎస్ఎస్‌జీఎస్ కళాశాలలో ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఏపీఎస్ఎస్‌డీసీ), కళాశాల యాజమాన్యం ఆధ్వర్యంలో పెట్టుబడిదారుల అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏపీఎస్ఎస్‌డీసీ కోఆర్డినేటర్ శ్రావణ, ప్రిన్సిపాల్ గోపాల్ మాట్లాడుతూ సెబీ, ఎస్ఎస్ఈ సూచనల మేరకు ప్రజలు డబ్బును నాన్ బ్యాంక్ సంస్థల్లో పెట్టుబడి పెట్టడానికి ముందు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించేందుకు కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. షేర్లు, స్టాక్ మార్కెట్, మ్యూచువల్ ఫండ్స్‌కు సంబంధించి పెట్టుబడి విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఇంటర్‌నెట్ బ్యాంకింగ్, డిజిటల్ పద్ధతుల ద్వారా లావాదేవీలు చేయాలని విద్యార్థులకు సూచించారు.ఏపీఎస్ఎస్‌డీసీ కళాశాల కోఆర్డినేటర్ బాలగంగాధర్, పీఆర్ఓ క్రిష్ణయ్య, అధ్యాపకులు వెంకటేశ్వర్లు, డాక్టర్ అమీర్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ రైల్వే ఉద్యోగి మృతి



షెక్షావలి(ఫైల్)

గుత్తి రూరల్: లచ్చానుపల్లి శివారులో లింగాల పంప్ హౌస్ వద్ద విధి నిర్వహణలో విద్యుదాఘాతంతో తీవ్రంగా గాయపడిన రైల్వే ఉద్యోగి ఎస్.షెక్షావలి(42) మంగళవారం చికిత్స పొందుతూ మృతి చెందాడు. రైల్వే వర్గాలు తెలిపిన వివరాలు.. గుత్తి బీసీ కాలనీకి చెందిన షెక్షావలి గుత్తి ఆర్ఎస్‌లోని రైల్వే ఎలక్ట్రికల్ విభాగంలో టెక్నీషియన్-1గా విధులు నిర్వహించేవాడు. విధి నిర్వహణలో భాగంగా ఈ నెల 2న రాత్రి లింగాల పంప్ హౌస్‌కు వెళ్లాడు. అయితే విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడటంతో నిచ్చెన వేసుకొని ట్రాన్స్‌ఫార్మర్ పైకి ఎక్కి మరమ్మతు చేస్తుండగా విద్యుదాఘాతానికి గురై పైనుంచి కిందపడ్డాడు. విషయం తెలుసుకున్న రైల్వే ఎలక్ట్రికల్ ఉన్నతాధికారులు గుంతకల్లు నుంచి హుటాహుటిన వైద్య బృందంతో కలసి ఘటన జరిగిన ప్రదేశానికి చేరుకొని తీవ్రంగా గాయపడ్డ షెక్షావలిని అనంతపురం తరలించారు. అనంతరం వైద్యుల సూచన మేరకు కర్నూలులోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మంగళవారం వేకువజామున అతడు మృతి చెందాడు. మృతుడికి భార్య బాను, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

సంక్షేమ ప్రభుత్వాన్ని కొనసాగించుకుందాం



కృష్టాపురంలో పర్యటిస్తున్న వీరాంజనేయులు, ఆలూరు సాంబశివారెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ



కోటంకలో వృద్ధురాలితో మాట్లాడుతున్న వీరాంజనేయులు

- వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త వీరాంజనేయులు

గార్లదిన్నె: రాష్ట్రంలో అర్హులందరికీ ఎలాంటి సిఫారసులు లేకుండా పథకాలు అందిస్తున్న జగనన్న నాయకత్వంలోని సంక్షేమ ప్రభుత్వాన్ని కొనసాగించుకుందామని వైఎస్సార్‌సీపీ శింగనమల నియోజకవర్గ సమన్వయ కర్త వీరాంజనేయులు, రాష్ట్ర ప్రభుత్వ విద్య సలహాదారులు ఆలూరి సాంబశివారెడ్డి పేర్కొన్నారు. కోటంక, మర్తాడు, బూదేడు, సంజీవపురం, క్రిష్టాపురం, యర్రగుంట్ల, ముకుందాపురం, పెనకచెర్ల, పెనకచెర్ల డ్యాం, పి.కొత్తపల్లి, కొప్పలకొండ, కేశవాపురం, కమలాపురం, కొట్టాలపల్లి, కెకెతండా గ్రామాల్లో నియోజకవర్గ సమన్వయ కర్త వీరాంజనేయులు, ఆలూరి సాంబశివారెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మతో కలసి పర్యటించారు. ముందుగా కోటంకలోని గుంటి కింద సుబ్రహ్మణ్య స్వామి ఆలయంలో స్వామిని దర్శించుకున్నారు. ఈసందర్భంగా వీరాంజనేయులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామ సచివాలయ వ్యవస్థ ద్వారా కులమతాలు, పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలోని 99 శాతం అంశాలను అమలు చేసిన ఘనత జగనన్నకే దక్కిందన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. అలాగే రాప్తాడులో ఈనెల 11న జరిగే సిద్ధం సభ జయప్రదం చేయాలని కోరారు.

లోకలైజేషన్ ఘనత జగనన్నదే..

శింగనమల చెరువును లోకలైజేషన్ చేసిన ఘనత జగనన్నకే దక్కుతుందని ప్రభుత్వ విద్యా సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి పేర్కొన్నారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నారని, మళ్లీ రాష్ట్రంలో గొప్ప పాలన కావాలంటే జగనన్నను సీఎం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నరేంద్ర రెడ్డి, ఎంపీపీ వెంకటనారాయణ, వైస్ ఎంపీపీ కుంచం రామ్మోహన్ రెడ్డి, మాజీ ఎంపీపీ ప్రదీప్ రెడ్డి, పాలిఏకరి కార్పొరేషన్ డైరెక్టర్ పరంధామ, జంబులదిన్నె సొసైటీ చైర్మన్ సుధాకర్‌రెడ్డి, సుబ్బిరెడ్డి, ఎస్సీసెల్ మండలాధ్యక్షుడు లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

'సిద్ధం' సభ విజయవంతం చేయండి



సిద్ధం పోస్టర్లు విడుదల చేస్తున్న నాయకులు

గుంతకల్లుటౌన్: ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో ఈ నెల 11న రాప్తాడులో జరిగే సిద్ధం సభను విజయవంతం చేయాలని మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్లు నైరుతిరెడ్డి, మైమూన్, మాజీ చైర్మన్ రామలింగప్ప పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో సిద్ధం వాల్ పోస్టర్లను వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికలకు పార్టీశ్రేణులతో పాటు ప్రజలంతా సిద్ధం కావాలన్నారు. ఎన్నికల సన్నాహక సభకు నియోజకవర్గం నుంచి పార్టీ కార్యకర్తలు, అభిమానులు వేలాదిగా తరలిరావాలని వారు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు సుంకప్ప, ఎస్సీసెల్ జోనల్ ఇన్‌చార్జ్ జింకల రామాంజినేయులు, కౌన్సిలర్లు లింగన్న, సుధాకర్, భాస్కర్, కోఆప్షన్ సభ్యుడు ఫ్లయింగ్ మాబు, రామాలయ ట్రస్ట్‌బోర్డు సభ్యుడు మల్లికార్జునశాస్త్రి, పార్టీ జిల్లా కార్యదర్శి నాగేంద్ర, జేసీఎస్ కన్వీనర్లు ఖలీల్, గోవింద్‌నాయక్, వార్డు ఇన్‌చార్జ్‌లు మస్తాన్, యూనస్, సంపత్, హరి, వీరేష్, ఎల్లప్ప, మార్కెట్ వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

ధర్మకర్తల నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

గుత్తి రూరల్: మండలంలోని తొండపాడు బొలికొండ రంగనాథ స్వామి ఆలయ ధర్మకర్తల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆలయ ఈఓ దేవదాసు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. రెండేళ్ల పాటు ఉండే ధర్మకర్తల నియామకం కోసం దేవాదాయ శాఖ నోటిఫికేషన్ విడుదల చేసిందని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు 20 రోజుల లోపు దేవదాయ శాఖ ఉప కమిషనర్ కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని సూచించారు.

ఆలూరు కోనరంగస్వామి ఆలయానికి..

తాడిపత్రిటౌన్: మండలంలోని ఆలూరుకోన రంగనాయకుల స్వామి ఆలయ ధర్మకర్తల నియామకం కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఆలయ ఈఓ సుబ్రహ్మణ్యం ఓ ప్రకటనలో మంగళవారం తెలిపారు. ఆసక్తి ఉన్న వారు 20 రోజులు లోపు కర్నూలులోని దేవదాయ ఉప కమిషనర్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఇంటర్, ఐదో తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోండి

గుత్తి రూరల్: మండలంలోని రజాపురం డాక్టర్.బీఆర్.అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో ఇంగ్లిష్ మీడియం ఐదో తరగతి, కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం(2024- 25) ఎంపీసీ, బైపీసీలో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. ఈమేరకు ప్రిన్సిపాల్ ఉషారాణి మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఐదో తరగతిలో ప్రవేశానికి ప్రస్తుతం 4వ తరగతి చదువుతున్న వారు, ఇంటర్‌లో ప్రవేశానికి ప్రస్తుతం 10వ తరగతి చదువుతున్న వారు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు ఈ నెల 23లోపు https://apbragcet.apcfss.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

బడుగుల అభ్యున్నతే జగనన్న లక్ష్యం



24వ వార్డులో పర్యటిస్తున్న సాయిప్రతాప్‌రెడ్డి

తాడిపత్రి అర్బన్: బడుగు బలహీన వర్గాల అభ్యున్నతే సీఎం వైఎస్.జగన్ లక్ష్యమని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి తనయుడు, యువ నాయకుడు కేతిరెడ్డి సాయిప్రతాప్‌రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని 24వ వార్డులో పర్యటించారు. స్థానికులతో సమస్యలపై ఆరా తీశారు. ఈసందర్భంగా సాయిప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ జగనన్న పాలనలో అన్ని వర్గాల అభివృద్ధికి పెద్దపీట వేశారన్నారు. సంక్షేమ పథకాల అమలులో దేశంలోనే రాష్ట్రం ముందంజలో ఉందన్నారు. జగనన్నను వచ్చే ఎన్నికల్లో తిరిగి గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. స్థానిక నాయకుడు వేణు తదితరులు పాల్గొన్నారు.

తాడిపత్రిటౌన్: పేదల సంక్షేమమే ధ్యేయంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పని చేస్తోందని ఎమ్మెల్యే తనయుడు కేతిరెడ్డి సాయిప్రతాప్‌రెడ్డి అన్నారు. వెలమకూరులో ఆయన మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల అమలుతీరును తెలుసుకున్నారు. స్థానికులతో సమస్యలపై ఆరా తీశారు. రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం కొనసాగాలంటే జగనన్నను మరోసారి సీఎం చేసుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డ్ వైస్ చైర్మన్ ఓబులరెడ్డి, మండల కన్వీనర్ పల్లె నాగేశ్వరెడ్డి, సీనియర్ నాయకుడు ఆలూరు రామేశ్వరెడ్డి, సర్పంచ్ మీనా, లింగేశ్వరెడ్డి, మురళీమోహన్‌రెడ్డి, రామకృష్టారెడ్డి, సుధాకర్‌రెడ్డి, గురుశంకర్, పవన్, త్రిలోచనరెడ్డి, దివాకర్‌రెడ్డి, హనుమంతరెడ్డి, విజయ్‌కాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించండి

గుత్తి రూరల్: విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని ప్రభుత్వ ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు శంకరయ్య తెలిపారు. మంగళవారం సేవాగఢ్ గురుకుల పాఠశాలలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజన నాణ్యతను పరిశీలించారు.

మండల పరిస్థితులపై ఆరా

యల్లనూరు: మండల ప్రస్తుత పరిస్థితులపై మంగళవారం నూతన తహసీల్దారు జయప్రసాద్ ఆరా తీశారు. డిప్యూటీ తహసీల్దారు శ్వేత, ఆర్ఐ హరిప్రసాద్, వీఆర్వోలతో ప్రత్యేక సమావేశమయ్యారు. మండల పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. మండలంలోని పోలింగ్ కేంద్రాలు, జనాభా, ఓటర్లు తదితర అంశాలపై తహసీల్దార్ చర్చించారు.

శివరాత్రి ఉత్సవాల నిర్వహణకు కొటేషన్ల ఆహ్వానం

గుంతకల్లు రూరల్: ప్రసిద్ధి చెందిన బుగ్గ సంగమేశ్వర ఆలయంలో మహా శివరాత్రి ఉత్సవాల నిర్వహణ పనులకు కొటేషన్లు అందజేయాలని ఆలయ ఈఓ క్రిష్ణయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. క్యూలైన్లు, చలువ పందిళ్లు, సున్నపు పూతలు, షామియానాలు, పూల డెకరేషన్, అన్నదానానికి కిరాణా సరుకుల సరఫరా, వంట మాస్టర్, కూరగాయల సరఫరా తదితర పనుల నిర్వహణకు ఆసక్తి ఉన్నవారు ఈనెల 16లోగా కొటేషన్లు అందజేయాలని పేర్కొన్నారు. వివరాలకు ఆలయ కార్యనిర్వహణాధికారి కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

సంక్షిప్త సమాచారం

నేడు గ్రామాల్లో సమన్వయకర్త పర్యటన

గార్లదిన్నె: మండల కేంద్రంతో పాటు జంబులదిన్నె, ఓబుళాపురం, పాపినేపాళ్యం, తిమ్మంపేట, గుడ్డాలపల్లి, శిరివరం, కల్లూరు, ఇల్లూరులో బుధవారం వైఎస్సార్‌సీపీ శింగనమల నియోజకవర్గ సమన్వయ కర్త వీరాంజనేయులు, రాష్ట్ర ప్రభుత్వ విద్యా సలహాదారులు ఆలూరు సాంబశివారెడ్డి పర్యటించనున్నారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నరేంద్రరెడ్డి పేర్కొన్నారు.

మద్యం విక్రేతల అరెస్టు

యాడికి: మండల కేంద్రంలోని కుంటలో శ్రీరంగ, బాలకృష్ణ అనే వ్యక్తులు మంగళవారం మద్యం విక్రయిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. నిందితుల నుంచి 30 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు సీఐ సీఐ నాగార్జున రెడ్డి తెలిపారు.

ఒకరికి తీవ్ర గాయాలు

గుత్తి: పట్టణ శివారులోని అనంతపురం రోడ్డుపై దిల్కా శీనా పెట్రోల్ బంక్ వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలు.. గార్లదిన్నెకు చెందిన రాముడు పని మీద బైక్‌పైగుత్తికి వచ్చాడు. తిరిగి బైక్‌లో స్వగ్రామానికి వెళ్తుండగా పెట్రోల్ బంక్ వద్ద అదుపుతప్పి కిందపడ్డాడు. తీవ్రంగా గాయపడిన అతడిని ఆసుపత్రికి తరలించారు.

శాంతిభద్రతలకు భంగం కలిగిస్తే ఉపేక్షించం

పెద్దవడుగూరు: గ్రామాల్లో శాంతి భద్రతలకు భంగం కలిగిస్తే ఉపేక్షించమని యాడికి సీఐ రోషన్, పెద్దవడుగూరు ఎస్ఐ శ్రీనివాసులు పేర్కొన్నారు. మంగళవారం దిమ్మగుడి, చిన్నవడుగూరులో పర్యటించారు. ఈ సందర్భంగా వారు జరగనున్న ఎన్నికల సమయంలో పాటించాల్సిన నియమాలను వివరించారు.గ్రామాల్లో అనుమానితులు సంచరిస్తే తమ దృష్టికి తీసుకురావాలన్నారు.

జొన్నగడ్డికి నిప్పు

పెద్దవడుగూరు: గుత్తి అనంతపురంలో రైతు శివకేశవరెడ్డికి చెందిన జొన్నగడ్డికి గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. సుమారుగా రూ.18 వేల వరకు నష్టం వాటిల్లిందని బాధిత రైతు వాపోయాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు.

మత సామరస్యానికి ప్రతీక మసూద్ గాజి దర్గా

- నేటి నుంచి ఉరుసు
- ఏర్పాట్లలో నిమగ్నమైన దర్గా కమిటీ సభ్యులు



మసూద్ గాజి సమాధి

శింగనమల: మండల కేంద్రంలో వెలసిన హజరత్ సయ్యద్ సాలర్ మసూద్ గాజి దర్గా మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తోంది. మతాలకు అతీతంగా భక్తులు దర్గాను దర్శించుకుని ప్రార్థనలు చేస్తారు. ఇంతటి ప్రత్యేక సంతరించుకున్న దర్గాలో బుధవారం నుంచి మూడు రోజులపాటు ఉరుసు నిర్వహించనున్నారు. ఈమేరకు దర్గా ముతవల్లి అబ్దుల్ రవూఫ్, దర్గా ముజావర్లు రజాక్ అహమ్మద్, గ్రామ సర్పంచ్ నాగమునెమ్మ ఆధ్వర్యంలో ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు.

మసూద్ గాజి దర్గా ప్రత్యేకత

శింగనమలలో హిందూ-ముస్లింలు కలిసి జరుపుకునే అతిపెద్ద పండుగ మసూద్ గాజి ఉరుసు. శింగనమలలో ప్రతి ఇంట ఈ పండుగను వైభవంగా జరుపుకుంటారు. ఏఇంట శుభకార్యం జరగాలన్న మొదట దర్గాకు వెళ్లి చక్కెర చదివింపులు చేయించుకుంటఆరు. ఆదేవిధంగా పాటు ప్రతి గురువారం భక్తులు దర్గాకు వచ్చి చక్కెర చదివింపులు చేయించడం అనవాయితీ.

వేడుకగా గంధం

బుధవారం నుంచి నుంచి ఈ 9 వతేది వరకు ఉరుసు మహోత్సవం నిర్వహించనున్నారు. తొలిరోజు గంధం, అదేరోజు రాత్రి 8 గంటల నుంచి భక్తులకు అన్నదానం నిర్వహిస్తారు. అదే రోజురాత్రి 9.30 నుంచి 1 గంట వరకు దర్గాలో పూలచాందిని తయారు చేస్తారు. పూల చాందినిని అలంకరించిన తరువాత తెల్లవారుజామున 1.30 గంటలకు పూల చాందిని(గంధం)ని పురవీధుల్లో ఊరేగిస్తారు. పక్కీర్ల జల్సాలు, కర్రసాము విన్యాసాలు, మంగళవాయిద్యాల నడుమ ఊరేగింపు సాగుతుంది. 8వ తేది ఉదయం 6 గంటలకు పూల చాందిని దర్గాకు చేరుకుంటుంది. అక్కడ చదివింపులు తరువాత, భక్తులు మొక్కులు చెల్లించుకుంటారు. గురువారం ఉరుసు మహోత్సవం నిర్వహిస్తారు. భక్తులకు అన్నదానం కార్యక్రమం నిర్వహిస్తారు. కందూరోత్సవం లాంటివి భక్తులు చేపడుతారు. ఆదే రోజు మధ్యాహ్నం ఐరుసు పందెం నిర్వహిస్తున్నారు. విజేతలకు మొదటి బహుమతి రూ.10 వేలు, ద్వితీయ బహుమతి రూ.5 వేలు అందించనున్నారు. రాత్రి ఖవ్వాలీ నిర్వహిస్తారు. 9న జియారత్ కార్యక్రమం నిర్వహించనున్నారు. ఆరోజు దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తారు. అనంతరం జియారత్ ఫాతెహా జరుగుతుంది. రాత్రి 10 గంటలకు క్రేజీ బాయ్స్ ఆర్కెస్ట్రా తెలుగు, హింది పాటల కచేరీ నిర్వహిస్తారు.

హాజరుకానున్న అతిథులు

ఉరుసు కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, ఏపీ ప్రభుత్వ విద్యా సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డిలు హాజరుకానున్నారు. కార్యక్రమంన శింగనమల , అనంతపురం, తాడిపత్రి, పామిడి, కల్లూరు, గుంతకల్లు ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున పాల్గొనున్నారు. ఉరుసు సందర్భంగా గట్టి బందోబస్తు చర్యలు చేపడుతున్నట్లు సీఐ శ్రీధర్ రాజు, ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపారు.

జగనన్నతోనే సంక్షేమాభివృద్ధి



విద్యార్థి పూజితకు ఆర్థిక సాయం చేస్తున్న కేతిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి

యాడికి: రాష్ట్రంలో సంక్షేమాభివృద్ధి కొనసాగాలంటే మరోసారి జగనన్నను ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాల్సిన బాధ్యత మన అందరిపై ఉందని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి తనయుడు, యువనేత కేతిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని బుగ్గ రోడ్డులో మంగళవారం నారాయణ స్వామి, ఆంజనేయ స్వామి కాలనీల్లో ఆయన పర్యటించారు. ఈసందర్భంగా ఆయన ప్రతి ఇంటి వద్దకు వెళ్లి సంక్షేమ పథకాలు అందుతున్నాయా అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. జగనన్న ఎన్నికల మేనిఫెస్టోను 99 శాతం మేర అమలు చేశారన్నారు. కల్లబొల్లి మాటలతో ప్రజలను మభ్య పెట్టడానికి వస్తున్న పార్టీలను నమ్మొద్దని కోరారు.

అనారోగ్యంతో ఉన్న ఇద్దరికి ఆర్థిక సాయం

నారాయణస్వామి కాలనీలో నివసిస్తున్న శ్రీదేవి కుమార్తె పూజిత అనారోగ్యంతో బాధపడుతుండటంతో రూ.10 వేలు ఆర్థికసాయం చేశారు. అదే కాలనీలో భర్త క్యాన్సర్‌తో బాధపడుతున్నాడని ఓ మహిళ కేతిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డితో కన్నీటి పర్యంతమవటంతో వైద్యఖర్చులకు రూ.10 వేలు ఆర్థిక సాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బొంబాయి రమేష్ నాయుడు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు వెంకటరామిరెడ్డి, సీనియర్ నాయకులు బాలా రమేష్ బాబు, భోగాతి బ్రహ్మానందరెడ్డి, బాల సాయి వివేక్, వైస్ ఎంపీపీ చెన్నప్ప, సింగిల్‌విండో ప్రెసిడెంట్ వెంకటరామిరెడ్డి, తూట్రాళ్ల పల్లె సర్పంచు సంజీవరాయుడు, నాయకులు భాస్కర్ రెడ్డి, శీన, తదితరులు పాల్గొన్నారు.

ఖాళీ స్థలాల్లో చెత్తాచెదారం వేయొద్దు



శానిటేషన్ కార్యదర్శులకు సూచనలిస్తున్న కమిషనర్ వెంకటరమణయ్య

గుంతకల్లుటౌన్: పట్టణంలో పరిసరాల పరిశుభ్రత ప్రజలందరి బాధ్యత అని, ఇళ్ల మధ్యలో ఉండే ఖాళీ జాగాల్లో చెత్తాచెదారాన్ని పారబోయొద్దని మున్సిపల్ కమిషనర్ వెంకటరమణయ్య ప్రజలకు సూచించారు. మంగళవారం పట్టణంలోని 7,8 వార్డుల్లో పర్యటించిన ఆయన పారిశుధ్య పనులను పరిశీలించారు. ఇంటింటా చెత్తసేకరణ, పారిశుధ్య పనులపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. చెత్తను ఇంటింటా చెత్తసేకరణకు వచ్చే ఆటోలకు అందజేయాలని కోరారు.

రోడ్లపై చెత్త వేస్తే కఠిన చర్యలు

గుత్తి: మున్సిపాలిటీ పరిధిలో రోడ్లపై చెత్తను వేస్తే ఇక నుంచి కఠిన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు వ్యాపారులను, తోపుడు బండ్ల నిర్వాహకులను హెచ్చరించారు. మున్సిపాలిటీలోని పలు ప్రాంతాల్లో మంగళవారం కమిషనర్‌తో పాటు సచివాలయ శానిటేషన్ ఉద్యోగులు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా దుకాణదారులు, చిరు వ్యాపారులు, తోపుడు బండ్ల నిర్వాహకులు చెత్తను ఎక్కడపడితే అక్కడ పడేసినట్లు గమనించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ చెత్తా చెదారాన్ని రోడ్లపై కాకుండా చెత్త బండ్లకు గాని లేదా చెత్త కుండీల్లో కాని వేయాలన్నారు.

తహసీల్దార్ల బాధ్యతల స్వీకరణ



చంద్రశేఖర్‌నాయక్ (పామిడి)



కుమారస్వామి (పెద్దవడుగూరు)



మల్లికార్జునస్వామి (పుట్లూరు)



హనుమంతునాయక్ (బీకేఎస్)

పుట్లూరు: స్థానిక రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్‌గా మల్లికార్జునస్వామి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల బదిలీల్లో భాగంగా ఇక్కడ పని చేస్తున్న తహసీల్దార్ మోహన్‌కుమార్ బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో మల్లికార్జున స్వామి ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూ సమస్యలను త్వరతగతిన పరిష్కరించడంతో పాటు ప్రజలకు అందుబాటులో ఉంటాన్నారు.

బుక్కరాయసముద్రం: స్థానిక రెవెన్యూ కార్యాలయంలో మంగళవారం నూతన తహసీల్దార్‌గా హనుమంతు నాయక్ బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేస్తున్న రమాదేవి అన్నమయ్య జిల్లాకు బదిలీ అయ్యారు. తిరుపతి జిల్లాలో పని చేస్తున్న హనుమంతు నాయక్ ఇక్కడికి వచ్చారు. ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందిస్తానని ఆయన పేర్కొన్నారు.

పామిడి: రెవెన్యూ కార్యాలయంలో మంగళవారం కొత్త తహసీల్దార్‌గా చంద్రశేఖర్‌నాయక్ బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేస్తున్న ఆర్వీ సునితబాయి నంద్యాల జిల్లా కొలిమిగుండ్లకు బదిలీపై వెళ్లారు. ఆమె స్థానంలో కర్నూలు జిల్లా కొత్తపల్లి నుంచి చంద్రశేఖర్ నాయక్ వచ్చారు. రెవెన్యూ పరంగా ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తామని తహసీల్దార్ అన్నారు.

పెద్దవడుగూరు: రెవెన్యూ కార్యాలయంలో మంగళవారం కొత్త తహసీల్దార్‌గా కుమారస్వామి బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేస్తున్న నాగభూషణ నంద్యాల జిల్లాకు బదిలీ అయ్యారు. కర్నూలు జిల్లాలో పని చేస్తున్న కుమారస్వామి ఇక్కడికి వచ్చారు. ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలు పరిష్కరిస్తానని తహసీల్దార్ పేర్కొన్నారు. అనంతరం పెద్దవడుగూరు, చిన్నవడుగూరు, కాశేపల్లి, మిడుతూరు, గుత్తిఅనంతపురం గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఓటర్లు ఎలాంటి ఇబ్బందులు జాగ్రత్తలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు.

'జగనన్న ఆరోగ్య సురక్ష' పేదలకు వరం



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ శ్రీవాణి

పుట్లూరు: ఆరోగ్య సురక్ష కార్యక్రమం పేదలకు వరం అని మండల వైద్యాధికారి శ్రీవాణి అన్నారు. మంగళవారం మండలంలోని కడవకల్లు గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా వైద్య పరీక్షలు నిర్వహించడంతో పాటు అవసరమైన వారికి ఉచితంగా శస్త్ర చికిత్సలు, ఇతర ఆరోగ్య పరీక్షలు చేయిస్తున్నామని తెలిపారు. అనంతరం సచివాలయ పరిధిలోని 300 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

పామిడి: మండలంలోని దేవరపల్లిలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు. అడిషనల్ డీఎంహెచ్ఓ డాక్టర్ సుజాతమ్మ, ఈఓఆర్డీ బీపీ శశికళ శిబిరాన్ని పరిశీలించారు. ఎద్దులపల్లి ప్రాథమిక వైద్యాధికారి ఉదయార్క ఆధ్వర్యంలో వైద్యులు నితిన్‌కుమార్‌రెడ్డి, సుధాకర్ 504 మందికి వివిధ పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. పంచాయతీ కార్యదర్శి మునీంద్ర, సచివాలయ సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

గార్లదిన్నె: మండల కేంద్రంలోని గ్రామ సచివాలయం-2లో మంగళవారం రెండవ విడత జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. వైద్యాధికారులు పలువురికి పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. అడిషనల్ డీఎంహెచ్ఓ డాక్టర్ సుజాత ఎన్‌హెచ్ఎం ప్రోగ్రాం అధికారి డాక్టర్ రవి శంకర్ పరిశీలించారు. పీహెచ్‌సీ డాక్టర్ గౌతమి, సీహెచ్ఓ లోక్‌నాథ్, ఆరోగ్య విస్తరణ అధికారి నాగేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

యల్లనూరు: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో బుక్కాపురం, ఆరవేడు పోలింగ్ కేంద్రాలలను మంగళవారం పుట్లూరు సీఐ సుబ్రహ్మణ్యం పరిశీలించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ మండలంలోని ప్రతి పోలింగ్ కేంద్రంలో తాగునీరు, కరెంటు, దివ్యాంగుల ర్యాంపులను పరిశీలించామన్నారు. పోలింగ్ కేంద్రాల్లో వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటామన్నారు.

9న అశ్వత్థంలో వేలం

తాడిపత్రిటౌన్: ఈనెల 9న పెద్దపప్పూరు మండలం అశ్వత్థనారాయణస్వామి క్షేత్రంలో మాఘమాసం బ్రహ్మోత్సవాలను పురష్కరించుకుని లడ్డూ విక్రయాలకు వేలం నిర్వహించనున్నారు. ఈమేరకు మంగళవారం ఆలయ ఈఓ సుబ్రహ్మణ్యం ఓ ప్రకటన విడుదల చేశారు. వివరాలకు 9959861168 నంబరులో సంప్రదించాలని సూచించారు.